

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand**@hotmail**.com**

## ఒప్పోల్

**భాష:** మలయాళం,**కథ, స్క్రీన్‌ప్లే** - ఎంటి.వాసుదేవన్ నాయర్; **కెమెరా** - మధు అంబట్; **దర్శకత్వం** - సేతుమాధవన్, **నటీనటులు** - మేనక, మాస్టర్ అరవింద్, బాలన్ కె.నాయర్

**విడుదల:** 1980

**అక్రమ సంతానం, లావారిస్ లాంటి** మాటలు మన సమాజంలో అత్యంత దయారహితమైన మాటలు. అంతేకాదు ఆ భావనే మనిషి ఉనికికి సజీవమయిన మనిషి జీవితానికి గొడ్డలి పెట్టులాంటిది. అలాంటి సంతానాన్ని సమాజం నుంచి వేరు చేయడం నిర్దాక్షిణ్యంగా చూడడం మనకు సర్వసాధరణంగా కనిపించే దృశ్యం. అక్రమ సంతానమనే భావజాలంతోనే పిల్లాడ్ని పెంట కుప్పలపైనా లేదా మరెక్కడైనా విడిచి మనిషి ఉనికి అర్థాన్నే భంగపరచడం కూడా మనం చూస్తాం. అంతేకాదు ఆ నేరాన్ని కేవలం తల్లిపైనే మోపి "దయాదాక్షిణ్యాలు లేని తల్లి" అంటూ పత్రికల్లో వార్తలు రావడమూ మనం చూస్తాం. ఆ బేబీ జననానికి స్త్రీతో పాటు సమానమైన బాధ్యతను కలిగి ఉన్న పురుషుడు మాత్రం ఇందులో సురక్షితంగా గట్టుమీదే నిలుచుండిపోతాడు. ఈ సమాజం వాడికి ఎలాంటి శిక్షను వేయదు. ఈ నేపధ్యంలో స్త్రీలు కూడా అలాంటి పిల్లల్ని అత్యంత వ్యధతోనో, సమాజం నుంచి ఎదురయ్యే సమస్యల భయంతోనో నిరాకరించి డిజోన్ చేసుకోవడమూ పరిపాటే.

ఇలాంటి ఓ సందర్భంలో తన సంతానాన్ని నిరాకరించకుండా సమాజం నుంచి ఎదురయ్యే సమస్యలకు ఎదురొడ్డి నిటారుగా నిలుచున్న ఓ స్త్రీ ఇతివృత్తాన్ని తీసుకుని నిర్మించిన చిత్రం 'ఒప్పోల్' ఆ బిడ్డని మొదట తన తమ్ముడిగా చెప్పుకున్నప్పటికీ నిర్ణాయక సమయంలో తన బాబుని తన కొడుకుగా ప్రకటించి వాడి కోసం తన జీవితాన్ని ధారపోసిన తల్లి కథ ఈ ఒప్పోల్.

తమిళ, కన్నడ, మలయాళ, హిందీ తదితర భాషల్లో అనేక పదుల సంఖ్యలో చిత్రాలకు దర్శకత్వం వహించిన కె.ఎస్.



సేతుమాధవన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సుప్రసిద్ధ రచయిత ఎం.టి.వాసుదేవన్ నాయర్ కథను, చిత్రానువాదాన్ని సమకూర్చిన ఈ చిత్రానికి 1980లో జాతీయ స్థాయిలో ద్వితియ ఉత్తమ చిత్రం అవార్డు లభించింది. చిత్రకథాంశం విషయానికి వస్తే ఆరేళ్ళ మగపిల్లవాడు అప్పు. అతని ఆలోచనల్లో, జీవితంలో మొత్తం ఉనికిలోనే పెద్దక్కయ్య మాలు ఉంటుంది. ఆమె తోడిదే జీవితంలాగా బతుకుతున్న అప్పుకి మాలు అక్కగానే తెలుసు కాని నిజానికి ఆమె అతడికి తల్లి. స్కూలునుంచి తిరిగి వచ్చిన ప్రతీసారి అప్పుకి ఎదురేగి ఆత్మీయంగా అక్కున చేర్చుకోవడం ఆమెకూ అతనికీ పరిపాటి. కానీ ఒకరోజు అప్పుకి మాలు కనిపించదు. ఎటూ తోచని స్థితిలో అప్పు మాలుని వెతుక్కుంటూ ఊర్లోని ఆలయంలోకి వెళతాడు. అకస్మాత్తుగా ఊడిపడ్డ అప్పుని చూసి బంధువులంతా అవాక్కువుతారు. గోవిందన్ మాత్రం అప్పుని ఆదరిస్తాడు. తమతో కొన్నాళ్ళపాటు ఉండేందుకు వాయినాధ్‌కు తీసుకెళదామంటాడు. అప్పుకి వాయినాథ్ బాగా నచ్చుతుంది. కాని తన అక్క మాలు పైన గోవిందన్ అధికారం చెలాయించడాన్ని జీర్ణించుకో లేక పోతాడు. ఒకరోజు గోవిందన్ పైకి ఎదురు తిరిగిన అప్పుని మాలు వారించి తిడుతుంది. ఆరేళ్ళ అప్పు ఏమీ అర్థం చేసుకోని స్థితిలో పారిపోతాడు. అడవిలో ట్రైబల్ బాలుడు నంబి కలుస్తాడు. ఇద్దరూ స్నేహితులవుతారు. ఓ గుహలో నివసించడం ఆరంభిస్తారు. ఈ స్థితిలో మాలు ఇక ఉండలేకపోతుంది. తన కొడుకు అప్పుకి అండగా ఉండాలని నిర్ణయించుకుంటుంది. ఇల్లు విడిచి అప్పుతో సహా స్వతంత్ర జీవనం గడపడానికి వెళ్ళిపోతుంది.

అది సాధారణంగా కనిపించే అతి చిన్న పాయింట్‌ని కేంద్రంగా చేసుకుని ఎం.టి.వాసుదేవన్ నాయర్ రచించిన స్క్రీన్‌ప్లే చిత్రానికి జవజీవాల్ని కలిగిస్తుంది. విభిన్న రకాల విషయాలతో పలు చిత్రాలు నిర్మించిన సేతుమాధవన్ ఒప్పోల్ ని సుందర్మగా మలిచాడు. 1980వ దశకం మొదటి రోజుల్లోనే వెలువడ్డ ఈ చిత్రం అవార్డులతో పాటు విమర్శకుల్నుంచి పాజిటివ్ ప్రతిస్పందననే అందుకుంది. ఇల్లెజిటిమేట్ చిల్డ్రన్ (అక్రమ సంతానం) అన్న భావనకు వ్యతిరేకంగా తన బాబుని తానే సగౌరవంగా పెంచేందుకు ఓ యువతి సమాజాన్ని ఎదిరించి నిలవడం విశేష ప్రశంసల్ని అందుకుంది.



## అదాజ్య

**భాష:** అస్సామీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం - డాక్టర్ సాంత్వానా బోర్దలోయి;

కథ - డాక్టర్ ఇందిరాగోస్వామి;

నటీనటులు - టామ్ ఆల్టర్, త్రిషాసైకియా, బిష్ణుత్రివేణి

**విడుదల:** 1996

**అనేక భారతీయ** **సామాజిక** సమస్యల్ని మన సినిమా ఏదో ఒకరకంగా ఏదో ఒక సందర్భంగా పట్టించుకున్నట్టుగానే స్త్రీల వితంతు సమస్యపైనా అనేక చిత్రాలు భిన్నకోణాల్లోంచి వచ్చాయి. ప్రధాన స్రవంతి సినిమా రంగం అన్ని విషయాల్లాగే దీన్నీ అంత సీరియస్‌గా పట్టించుకోలేదు కాని భారతీయ సమాంతర సినిమా రంగంలో వితంతు సమస్యని కేవలం సమస్యగానే కాకుండా చైతన్యవంతమైన వితంతువు గురించి, ఆత్మార్పణ చేసుకున్న వితంతువుల ఇతివృత్తాల్ని తీసుకుని అనేక చిత్రాలు నిర్మితమయ్యాయి.

భారతదేశంలోని వివిధ ప్రాంతాల సినిమా రంగాల్లాగే ఈశాన్య ప్రాంతపు సినిమా రంగంలో ప్రధాన స్రవంతి సినిమాలు కమర్షియల్ హిందీ రంగ ప్రభావంలోనే ఉన్నాయి. అయితే, సైకియా, జానూబారువా లాంటి బాధ్యతాయుతమైన చలన చిత్రకారుల కృషి, ప్రభావాల ఫలితంగా మరికొంత మంది నవ్యచలనచిత్రకారులు రూపుదిద్దుకుంటున్నారు. అలా చలన చిత్రసీమకు లభించిన దర్శకురాలే డాక్టర్ సాంత్వానా బోర్డులోయి.

ఆమె ప్రధానంగా నటి. అనేక నాటక సమాజాల్లో బహుమతులు గెల్చుకున్న ఆమె వృత్తిరీత్యా డాక్టర్. కాని ప్రవృత్తి ప్రభావాన్నించి తప్పించుకోలేని ఆమె మొదట నాటకం ఆ తర్వాత సినిమా వైపు దృష్టిని మరల్చారు. మొదట టెలిఫిల్మ్, ఆ తర్వాత టీ అసోసియేషన్ కోసం కొన్ని చిత్రాలు నిర్మించిన సాంత్వానామొదట పూర్తి నిడివి చిత్రం 'అదాజ్య' దాని అర్థం ఎగిరిపోవడం. ఈ చిత్రంలో వితంతు సమస్యని, ముగ్గురు వితంతువుల్నీ వారి అనుభవాల్ని వ్యక్తిత్వాల్ని విశ్లేషిస్తూనే కట్టుబాట్లనుంచి, కట్టడినుంచి ఎగిరిపోవాలని భావించే నవ వితంతువు మానసిక స్థితిని ఆవిష్కరించింది. అయితే ఈ సమస్యను సాధారణ కుటుంబంలోని సమస్యగా కాకుండా అస్సాంలోని ఒక ప్రత్యేక తెగకు ఓ ప్రత్యేక పరిస్థితులకు చెందిన కుటుంబాన్ని కాన్వాస్‌గా చేసుకుని నిర్మించింది. చిత్ర ఇతివృత్తరీత్యా, నిర్మాణ రీత్యా మంచి ప్రతిభను కనబర్చిన సాంత్వానా ముగింపు విషయంలో కొంత ఉదాసీనతనే వ్యక్తం చేసింది. తాను తన అభిలాష మేరకు స్వేచ్ఛగా జీవించలేనప్పుడు స్వేచ్ఛగా మరణించగలనని ఈ చిత్రంలోని ముఖ్యాభినేత రుజువు చేస్తుంది.

చిత్ర కథాంశం 1940 ప్రాంతానికి చెందింది. ఎం.ఆర్.గోస్వామి రచించిన నవల 'దతల్ హాతిర్ ఉయె కేవా హావుడా'లోంచి కొంత భాగాన్ని తీసుకుని చిత్ర కథాంశంగా రూపొందించింది. అస్సాంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ఉన్నత కులాలకు చెందిన కుటుంబాల్లోని ఆచారాల్ని నేపథ్యంగా తీసుకుని, ఆ కుటుంబాల్లోని వితంతు సమస్య ప్రధానాంశంగా ఈ చిత్రాన్ని మలిచారు స్వాంతనా. దామోదర్ దేవ్ తెగకు చెందిన ప్రధాన సత్రాధికార్ కుటుంబం ఈ చిత్రంలో కథావేదిక. సత్రాధికార్‌కు అనేక మంది అనుచరులుంటారు. ఆచారాల పవిత్రతను ప్రభోదించడంలోనూ వాటిని భగ్నం చేసినవారికి శిక్షలు నిర్దేశించడంలోనూ ఆయన రాసిన గ్రంథాలు ఆ తెగకు శిరోధార్యాలు. మొత్తంగా ఆ తెగపైన ఆయన భావాధిపత్యం ఉంటుంది. ఆచార వ్యవహారాల విషయంలో ఆయన నిర్దేశకత్వం వ్యతిరేకించలేనివిగా ఉంటాయి. అలాంటి సనాతన కుటుంబంలో ముగ్గురు వితంతువులుంటారు. చిత్రం మొత్తం వారి చుట్టూరా అల్లుకుని ఉంటుంది. సత్రాధికారి చెల్లెలు దుర్గ భర్తను కోల్పోయి అన్న ఇంటికి వస్తుంది. ఆమె వితంతువుకు సంబంధించిన అన్ని ఆచార వ్యవహారాల్ని తుచ తప్పకుండా పాటిస్తూ ఉంటుంది. ఆమె ఏకైక కోరికల్లా ఎప్పటికైనా కాశీకి వెళ్ళి తన భర్తకు సంబంధించి అంత్యపూజలు నిర్వహించడమే. కానీ ఆ కోరిక ఎప్పటికప్పుడు వాయిదాపడుతూ ఉండడమే ఆమెకున్న సమస్య. దాంతో తీవ్ర నిరాశా, నిస్పృహలకు గురవుతుందామె. ఇక సత్రాధికారి సోదరుని వితంతువు ఆ ఇంట్లోని రెండవ వితంతువు. ఆమె తన నమ్మకస్తుడైన పనివాడిచేత ఇళ్ళ కిరాయిలు వసూలు చేయించుకుంటూ తన ఆస్తిని పరిరక్షించుకుంటూ కాలం వెళ్ళదీస్తూ ఉంటుంది. అయితే ఆ పనివాడికి, ఆమెకు మధ్య ప్రేమ వ్యవహారం ఉంటుంది. దాన్ని దుర్గ ఎప్పటికప్పుడూ రహస్యంగా పరిశోధిస్తూ ఉంటుంది.

ఇక సూత్రాధికారి చిన్నకూతురు గిరిబాల ఆ ఇంట్లోని మూడవ వితంతువు. ఆమె సినిమా ప్రారంభంలోనే అప్పుడే భర్తను కోల్పోయి తల్లిగారింటికి చేరుతుంది. నవయువతి అయిన ఆమె మిగతా ఇద్దరు వితంతువుల కంటే భిన్నంగా ఆలోచిస్తుంది. వితంతువులకూ స్వేచ్ఛ ఉంటుందని, తమ ఇష్టం వచ్చిన చోట నివసించే అధికారం వారికుంటుందని ఆమె భావిస్తుంది. ఇంతలో

బ్రిటన్‌కు చెందిన పరిశోధకుడు దామోదర్ దేవ్ తెగలో ఉండే ఆచార వ్యవహారాలపైన పరిశోధించడానికి వస్తాడు. తన పరిశోధనలో భాగంగా అతడు స్త్రాధికారి ఇంటికి తరచుగా వచ్చిపోతూ ఉంటాడు.

తమ ఆచారాల గురించి పవిత్ర గ్రంధాల్లోని అంశాల గురించి అతడికి వివరించే బాధ్యతను గిరిబాలకు అప్పగిస్తారు. ఆమె అతడితో తరుచూ కలవడం అతి దగ్గర్నుండి అనేక అంశాలు వివరిస్తూ ఉండడంతో వారి మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. పురుషుడితో సాన్నిహిత్యం ఆమెలోని స్త్రీత్వాన్ని తట్టి లేపుతుంది. ఇద్దరూ అత్యంత దగ్గరవుతారు. ఈ మార్పులన్నీ గిరిబాల తల్లికి, ఇంట్లోని వారందరికీ తెలిసిపోతాయి. గొడవ అవుతుంది. గిరిబాల ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనంటారు. ఇదంతా భరించలేని గిరిబాల తీవ్రంగా మదనపడుతుంది. వితంతువుగా తన జీవితంపై తనకు అధికారం లేని స్థితి ఆమెను ఆలోచనలో పడేస్తుంది. తన అభీష్టం మేరకు జీవించలేనప్పుడు తన ఇష్టం వచ్చినట్టుగా చనిపోయే హక్కూ తనకుంటుందని భావిస్తుంది. ప్రాయశ్చిత్త కార్యక్రమంలో భాగంగా వారి ఆచారం ప్రకారం ఆమెను మండుతున్న గుడిసెలోంచి దూరి బయటకు రావాల్సిందిగా ఆదేశిస్తారు. ఆమె దూరుతుంది. కాని బయటకు రాదు. అందరిలో భయోత్పాతాలు రేపుతూ గుడిసె మంటల్లో ఆమె దహించుకుపోతుంది. అంధ విశ్వాసాలకు ఆచారాలకు బలైపోతుంది.

అస్సాం ప్రాంత కుటుంబ జీవనమూ, ఆచార వ్యవహారాలూ ఈ చిత్రంలో యదార్థంగా చిత్రించబడ్డాయి. 1940 ప్రాంతపు నేపథ్యాన్ని ఆవిష్కరించడంలోనూ నేటి స్త్రీల స్థితిగతుల్ని చిత్రబద్ధం చేయడంలోనూ దర్శకురాలు విజయం సాధించారు. తన తొలి చిత్రంతోనే ఆమె దేశవ్యాప్తంగా పలువురి దృష్టిని ఆకట్టుకున్నారు.

●●●

Click here to share your comments on this article.